
*కడుపు మంటను తీర్చుకోవాలంటే, అది అసలు మంటకు దారితీసింది. ఆ మరిటలో కాలే గుడిసెలు, కాష్ఠంలా కనిపించే ఆ కళ్ళలో....కథ అంతటితోనే ఆగుతుందా? ఆగితే.... అది కన్ను కాదు. మరి చిత్ర కన్నే!*

## ఏడకల మధ్య నుంచి సన్నగా పొగ లేస్తుంది.




నర్సయ్య వొడ్డె ముత్తడితో కలిసి బస్తీ కెళ్ళి పందుల అమ్మకానికిగాను సొహన్‌లాల్ సేట్‌జీతో బేరమాడు తున్నాడు.

వరుశ రాములు, అమ్మగా అమ్మగా మిగిలిన అర ఎకరం నేలా అమ్ముకొని తాగటానికి అకుమడచుకుని తాటిచెట్టెక్కిన ఎల్లిగొడు వంక చూస్తున్నాడు - నాగ రాజం, పిల్లల్ని ఇళ్ళలోకి పంపించేసి స్కూల్లోనే టీచర్లంతా కలిసి వేసుకున్న సిండికేట్‌లో సిగెరెట్ తాగుతూ కమ్మలు వేస్తున్నాడు—

సరిగ్గా అదే సమయాన:-

ఆ ముగ్గురినీ కన్నతల్లి బాలవ్వ ఆయాన పడటం మానేసింది.

అదేం చిత్రమో కాని - లచ్చవ్వ పోసిన తులసివపరు నోట్లో పడటంతోటే బాలవ్వ ఆయాసం చల్లారింది. లచ్చవ్వ పెద్ద నోరు చేసుకుని ఏడవటం చుట్టు ప్రక్కల వాళ్ళకి ఆశ్చర్యంగా అనిపించి గునగునా పరిగెత్తుకొచ్చారు.

బాలవ్వ మాత్రం యెండుగడ్లో నిర్జీవంగా పడివుంది. ఈదురుగాలికి యెండు గడ్డి కిలకిల లాడ్తుంది కానీ బాలవ్వ మాత్రం కట్టెలా వుండిపోయింది.

* * *

ఏడు గంటలయి చీకటి పడ్డప్పుడు ఓ నిర్ణయాని కొచ్చాడు నర్సయ్య. "తన అవ్వ యెన్నోసార్లు తనకి బతిమాలి చెప్పేది. "నేను సచ్చిపోయినంక నన్ను పాతి పెట్టకుండ్రి. కాలెయ్యండ్రిరా. ఆఖరుకు నా దగ్గరి బంగారం పెట్టైనా సరే" అని చేతిలో చేయి కూడా వేయించు కుంది.

కట్టె కొట్టటానికి, డప్పు కొట్టడానికి మాదిగల్ని పిలిపించుక రమ్మని వొడ్డె ముత్తడ్ని పంపాడు నర్సయ్య.

అప్పుడే నలుగురు పెద్దమనుషులు శవం దగ్గరికి చేరారు. ఇద్దరు మాదిగ పెద్దలు వచ్చారు. గోచీ, రుమాళ్ళుతప్ప అంగీల్లేవా యిద్దరికీ. "ఎంత తీసుక్కుంటర్రా" అడక్కూడదనీ, కొంచెం ఎక్కువే ఇవ్వాలనీ తెలిసినా నర్సయ్య పీసుగా అడిగాడు.

"గదే రెండు పన్లకి ఎనభై రుపాయలియ్యండ్రి." అన్నాడు మీసాలతను. వరుశ రాములు గోడకు చేరగిలబడి నిల్చున్నాడుతప్ప ఏమీ మాట్లాడ్డంలేదు. "ఇరవై రుపాయలిత్త" అని ఓ నిమిషం గడవకముందే "ఏమంటర్రా" అన్నాడు నరసయ్య.

"మేంజెయ్యం, మావోడింక తక్కువడిగిండు. ఎనభైకేం తక్కువున్నా. ఉహూ. మేం జెయ్యం." అన్నాడు ఎర్ర రుమాలతను.

"ఎందుకు జేత్తర్రా: కనరెక్కిందిరా మాదుగులకు. ఇర్వయిత్తనంటె గూడ ఒల్లనని సీల్గుతాండ్రు. నీ యవ్వ...." నర్సయ్య మాట్లాడ్తొంటే ఆ నోట్లోంచి తుంపరపడుతోంది. పెద్దమనుషుల్లోవున్న పోలీసు పటేల్ కూడాఏమనలేదు.

"ఇర్వయా:తూ.... తెనుగోడిచ్చిండు యాభయి అంతకంటె అద్వానమా థూ... నీ వొంశమే గంత" మీసాలతను కోపం పెచ్చేగిపోతున్నట్లన్నాడు.

"ఉంచుతావురా నేనింత అగ్గువైనానురా పోని- అయితె అయితిగని మువ్వయికి జెయిండ్రి :"

మాదిగల్ని నర్సయ్య చావుకాడ బేరమాడుతున్నందుకు చుట్టూ గుమిగూడుతున్నవాళ్ళు ఆయన పిసినారితనాన్ని తిట్టుకొంటున్నారు.

నలుగురు పెద్దల్లో పోలీస్ పటేల్ వుండ

బట్టలేక సారా తెప్పించుకు తాగుతున్నాడు. పక్కన్నే మస్కూరీ నిలబడి గ్లాసులో పంచిస్తున్నాడు. ఇద్ద రేమన్లేదు.

మిగిలిన పెద్దే సర్పంచు.

ఆయన మాదిగలని సముదాయించ బోయి "యాభై"కి వొప్పుకో మన్నాడు.

ఎర్ర రుమాలతను సర్పంచువంక తిరిగి విషయమంతా ఏకరువు పెట్టసాగాడు.

"కాదు పటేలా ఈయినె కేమయిందని మువ్వయి త్తడు. యాభయి త్తడు. కులం తక్కువోడా? లేనోడా? ఇంటినిండ పైస లెట్కోని.... పోనీ మీ అసోంటోళ్ళకు మొఖం జూసన్న యాభయికో అరవైకో జే త్తం. ఎందుకని? అందినంత మీ దగ్గర తింటనే వున్నం. ఈ పీసోని దగ్గర తుసు రంతన్న దిన్నమా మమ్మల్ని దోస్కోక పోతెజాలు. ఇన్ని లగ్గాలు జేసుకున్నరు. ఒక్క లగ్గానికన్న పిలిసింత పెట్టింర్రా. ఇన్ని వంటలు దీసుకున్నరు. ఇన్ని కల్లా లయినయి. కల్లం కాడికి పోతె ఒక్క సారన్న ఒక్క త్తన్న పెట్టిండా. మాతోని పని జేయించుకుంటె బిచ్చం పెట్టవ ద్దని చెప్పులు గూడ వాళ్ళే ముడుసుకునిరి. పగ్గాలు పేనుకునిరి. మాకేం లాబపడ్డరు? తెనుగోళ్ళకక్కర కొ త్తరు. కుమ్మరోళ్ళ క్కరకొ త్తరు.... యీనె దేనికక్కర కొ త్తడు??? నాల్గు బర్రెలు పాలి త్తన్న యని సల్లకువోతె పైసలి త్తెనే పో త్తనన్న దట ఈనె పెండ్లాం. పోని, పైసలు దీస్కో నన్న సల్ల పోసిందా వు త్తనీళ్ళు పోసింది. తల్చుకుంటె కండ్లకు నెత్తు రొ త్తది. మాదే ఆండ్లనో .... ఇండ్లనో....దోసు కున్నడు. ఖర్చయిద్దనేగాదు పటేలా యిన్ని సావులయితె బొంద పెట్టింర్రుగని. ఒక్క టన్న కాష్టం పెట్టింర్రా కనీసం. ఇసోం టోళ్ళారిల వుండెందుకు? వుండి దండుగ మన్నులు...."

వాడి నోట్లోంచి దూకుతున్న మాటలకి ఆనకట్ట లేకుండా పోయింది. నర్సయ్య కెన్నడూ రానంతకోపం వచ్చింది. రబ్బరు బుగ్గలో గాలిలానిండి వుబ్బి పోయాడు నర్సయ్య. ధన్‌మని పగిలినట్లు విరచుక పడ్డాడు మాదిగలమీద.

"లంజకొడుక్కులు ఏంర్రా. ఏమం టంర్రూ...తన్నుంర్డి: ఎట్లంటంర్రో సిగ్గు లేదు తన్నుంర్డి. నీ యవ్వ నేనెందుకు సె త్త. నాగిట్ట పుట్టిర్నా కొడుకులు!"

పెద్దల సమాధానపరచే మాటలు ఎవరూ చెవిన బెట్టదలచుకోలేదు.

మీసాలతను, ఎర్ర రుమాలతను విడి విడిగా నర్సయ్యను తిడుతున్నారు.

పరుశరాములు మాత్రంపాత గోడకొరిగి కూర్చొని కునికిపాట్లు పడుతున్నాడు.

"నీకు పుట్టాలంటవ్ లే మల్లగినంటే తం తం ఎక్కువోనివై తెనుక సీరి కొడుకా.... పైసుంటె నెత్తిల వెట్టుకోని ఊరేగుగని గంతమాట ఎట్లొచ్చింది నీనోటికి— మా కస్టం దిన్నవ్. మమ్మల దోసుక తిన్నవ్ మిత్తీలకిచ్చి, నాగులకిచ్చి మమ్ముల ముంచి నువులేసినవ్. మాగ్గిట్ట పుట్టినవను కోవన్నార నిన్ను."

లచ్చవ్వ బయట కొచ్చింది శవం దగ్గ ర్నుంచి లేచి.

నలుగుర్లో పడి నాలుగు మాటలనాలని నోరిడిసి పెట్టింది.

లచ్చవ్వ, నర్సయ్య ఒక పక్షం —

ఎర్రరుమాలతను. మీసాలతను ఒక పక్షం—

బూతులు తిట్టుకుంటున్నారు. మధ్య స్థులు నోరుమూసుకుని చూస్తున్నారు.

నర్సయ్య తన్నటానికన్నట్లు వాళ్ళ మీదికి ఉరకబోయాడు. పెద్ద మనుషులు నర్సయ్యను ఆపి లాక్కొస్తున్నారు. పెద్ద మనుషులు దెబ్బలు పడకముందే అలా ఆగబడతారని తెలిసుండబట్టే నర్సయ్య మాటిమాటికీ ముందుకు ఉరుకుతున్నాడు.

అక్కడ అల్లరి జోరైంది.

పొయిలో పడ్డ ఉప్పురాళ్ళలా చిటపట లాడ్తున్నాయి మాటలు.

అప్పుడే నాగరాజం దిగాడు.

అక్కడ వాతావరణం బాగాలేదనీ, కలి గించుకుంటే దబ్బుమీద ఒరుగుతుందేమో నని అర్థంచేసుకుని "ఓ అవ్వా, నా అవ్వా నువ్వెట్లపోతివే ఓ అవ్వా" అని పెద్దగా ఏడుస్తూ (గాడిద ఓండ్ర పెడుతున్నట్టుంది కొందరికి) శవం దగ్గరికి పరిగెత్తాడు.

శవం దగ్గరి జనమంతా గొడవ దగ్గరికి చేరారు.

పెద్ద మనుషులన్న యాభైకి పై సెక్కు వియ్యననే నర్సయ్యా. ఎనభైకి వాక్క పైస తక్కువైనాకూడ పనిజెయ్యమన్న మాదిగలూ, అసలు విషయం గంగ మధ్యలో వొదిలేసి తిట్లు చల్లు కుంటు న్నారు. /

కూర్చున్న వాళ్ళంతా యెంత జోక్యం చేసుకున్నా యెవరూ తిట్లు మానలేదు.

విచిత్రమైన కేసే అది.

ఆ కేసు నెలా పరిష్కారం చెయ్యాలో ఆ నలుగురు పెద్దలకీ అర్థంకాలేదు. నలు గుర్లో సర్పంచు, పోలీస్ పటేలుకూడా వున్నారు. వాళ్ళు సీసాలోని సారా గ్లాసుల్లో పంచుకుని అంతమంది సిగ్గుపడకండా తాగేస్తున్నారు.

పెద్దల కర్థంకానిది లచ్చవ్వ కర్థమైంది.

తన పరిష్కారం అందరికీ వినబడే టట్లు నర్సయ్యతో చెప్పేసింది.

"వాళ్ళతోనేంది? వాళ్ళ సావు వాళ్ళు పడతరు. మనకు పింతలున్నయి - దేవు డిచ్చిన సేతులున్నయి - మనమే కట్టెలు గొట్టుకోని మనమే కాష్టం పేర్చుకుంటె పోదా?? పా. ఎనభై ఇచ్చి గాళ్ళతో ఏంది? మనం జేసుకుంటె జెర సేపట్లయి తది. పోదాంపా." నర్సయ్యకు లచ్చవ్వ చెప్పింది. బాగా నచ్చింది. అంత గొప్ప

## కోరిక

అస్తమించిన
సూర్యుని వంటిది
కోరిక —
మళ్ళీ మర్నాడు
ఉదయిస్తుంది.

—ఉప్పద్రష్ట సాయి

దేవిప్రియ రచించిన
సమాజానందస్వామి
తెలుగు పాఠకుల అభిమానాన్ని విశేషంగా
చూరగొన్న సమాజానందస్వామి
కార్టూన్ కవితల సంపుటి
చంద్ర గీసిన 50 కార్టూన్లతో పుస్తకరూపంలో
వెలువడింది! (ప్రజాతంత్ర నుంచి పునర్ముద్రితం)
వెల: 5 రూపాయలు
ప్రతులకు:
దేశి బుక్ హౌస్, నారాయణగూడ, హైదరాబాదు-29

వెలువడింది!

ఆలోచన తనకే రానందుకు బాధపడ్డాడు.

"ఆఁ కాపు బిడ్డ జెప్తుంది గద - గట్ల జేసుకోండ్రి. శిన కదరుంటది. పైనకు పది ముళ్ళేసేటోళ్ళు మీ కెందుకి సోంటియి?" అనుకుంటూ మాదిగలిద్దరూ వెళ్ళిపోయారు.

నలుగురు పెద్దలూ. కూడిన ఆ మందీ ఆ నిర్ణయానికి చెవులు మూసుకొని వెళ్ళి పోక తప్పలేదు.

మంది మాత్రం లచ్చవ్వ పనికి తలా ఓ రకంగా తిట్టుకున్నారు.

"ఎంత పైసుంటే ఏంపలం? బుధులుం డాలెగని" "ఇంతకన్న పీనుగల్నయం.."

జనం శూన్యమైంది.

శవం మాత్రం మిగిలింది.

శవంమీదపడి ఏడ్చే నాగరాజం.

గోడ కొరిగి నిద్రపోతున్న పరుశ రాములూ.

తల్లి పక్కన అదేపనిగ ఏడ్చే బిడ్డా. మిగిళారు.

మధ్య రాత్రి కాలేదింకా—

గొడ్డళ్ళు పట్టుకుని నర్సయ్య. లచ్చవ్వ. కొడుకు శంకర్రెడ్డి. వొడ్డె ముత్తడూ కలిసి వెళ్ళారు.

విసుగ్గా వచ్చే మాధిగ పెద్దల వంక మిగతా మాదిగలు ఎదురొచ్చేరు.

జరిగింది విని ఆలోచిస్తూ గుడిసెలవైపు నడుస్తున్నారు.

"గిదే జరిగితే. ఒకల్ని జూసొగలు, ఒగల్ని జూసొగలు, అందరూ వాళ్ళకు వాళ్ళే చావు జపుపుకుంటరు...." అన్నా దొకతను. అందరి జీవితాలకూ హెచ్చ రికలా వుందా మాట.

"జరిగితే— అవెనుక మనకు దొప్ప కూడా దొరకది. ఇప్పటికే తిండికిట్ల జస్తుంటే ఇంక ఈ యింత అసరా పోతె ఏం దొరుకుతది?" మీసాలతను నిర్ణయం చెప్పేశాడు.


ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

మా చికిత్సవల్ల తెల్లమచ్చలు గలవారికి పూర్తిగా నయం అవడం ద్వారా మా వైద్యం మంచి కీర్తిని పొందింది. ప్రచారం నిమిత్తం ఒక ప్యాకెట్టు మందు ఉచితంగా ఇవ్వబడును. మొదటి కోర్సుతోనే మచ్చల రంగు మారడం ఆరంభమవు తుంది. జబ్బు వివరాలు వ్రాయండి.

GAUTAM CHIKITSALAYA
(S-DD)
P.O.) KATRI SARAI (GAYA)


గాలి వీచినపుడు కదలిపోయిన ఆకుల్లా కదిలి కదిలి వాళ్ళంతా ఎందుకో ఒకరి ముఖాలొకరు చూసుకొన్నారు.

తెల్లారే వేళకి నర్సయ్య వాళ్ళు కాష్ఠం పేర్చి ఇంటికొచ్చారు. పాడె కట్టి తమ్మలి డప్పుని పిలిచారు.

నలుగురు పెద్దలు రాలేదు. జనమెవరికీ రాబుద్ధేయతేదు.

పరుశ రాములు. తలకొరివి పెట్టడానికి ఏదో కుండ ఒకచేత్తో. పొగనికక్కే కొత్తా యిని ఒక చేత్తో పట్టుకుని నించున్నాడు.

సూర్యుడు మెల్లిగా తొంగి చూస్తు న్నాడు.

పాడెకు మూడో పక్క శంకర్రెడ్డి. మరి నాలుగో పక్క??

ఆడవాళ్ళు పట్టకూడదు. "ఎలా?" నర్సయ్య చుట్టూ చూశాడు. కనుచూపు మేరలో ఎవరూ లేరు. ఒక్క వొడ్డె ముత్తడు తప్ప—

నాలుగో పక్క వొడ్డె ముత్తడి చేత పట్టించక తప్పలేదు!!

తమ్మలిడప్పు మోగుతోంది.

తలిసిగ్గర పిడకల్లోంచి పొగ వస్తోంది.

పాడె లేచింది.

సొన్నాయిల్లేని లోటు బిడ్డ సాగించే ఏడుపు తీరుస్తుంది.

పాడెలో బాలవ్వ శవంమీదుగా తెల్లటి మబ్బులు తేలిపోతున్నాయి.

బాలవ్వ తన జీవితంలో అందరిలా కాకండా చాలా ప్రత్యేకమైన కలలు కన్నది. వింత కోరికలే కోరుకుంది. అవన్నీ కేవలం తన చావుగురించే—.

"నలుగుడు కొడుకుల్ని కనాలనుకుంది కనీసం. తనపాడె నాలుగుదిక్కులూ కొడుకులే మోయాలని!" ముందు ఆడపిల్ల పుడితే ఎంతో బాధపడిపోయింది.

తర్వాత్తర్వాత "తను చచ్చిపోతే ఏడవటానికి ఆ ఒక్కత్తే పనికొస్తుందిలే" అని సరిపెట్టుకుంది.

బిడ్డతర్వాత వరుసగా ముగ్గురూ కొడుకులే పుడితే కొండను తవ్వేశానన్నంత సంతోషపడింది.

అంతలోకే పెద్ద ఘోరం జరిగి పోయింది.

మొగుడు చనిపోయాడు.

నాలుగో కొడుకు నివ్వకండానే చని పోయినందుకు ఆ మొగుడ్ని తను చని పోయేవరకు రోజూ తిట్టుకుంది.

నిశ్శబ్దంగా వెళుతోంది శవం.

వీధుల్లోకి వచ్చి కట్టలు కట్టలుగా గుమి కూడి చూస్తున్నారు జనం.

అంతేకాని— వెనక ఎవరూ వెళ్ళటం లేదు.

శవంమీద చల్లిన పేలాలు బాలవ్వమీద పడకుండానే గాలిలోకి తేలిపోతున్నాయి. కిందపడ్డ పేలాల మీంచి కొడుకులు నడచి వెళ్తున్నారు.

"బాలవ్వకి బంగారంమీద. డబ్బు మీద పెద్ద మోజుండేది. భూమ్మీది డబ్బూ. బంగారమంతా తన ఇంట్లో చేరితే బాగుండేదన్నంత పిచ్చిగా ఉండేది. తను చస్తే ఏడుపైనా ఏడుస్తుందని బిడ్డనీ తల్లికి తలకొరివి పెట్టడానికి పనికొస్తాడని చిన్న కొడుకునీ తప్ప మిగతా ఏ కొడుకునీ అంత ప్రేమగా చూల్లేదు. నిజానికి ప్రేమ చాలకబోస్తూ కూర్చుంటే డబ్బెలా కూడు తుంది; డబ్బు కూడందే తన "చావు" బాగా ఎలా జరుగుతుంది?? ఆ ఉద్దేశ్యం తోనే మొగుడ్ని కూడా ఒక్క నిమిషం కొడుకుల్ని ముద్దాడనివ్వలేదు.

బాలవ్వ కాపురాని కొచ్చేనాటికి తన మొగుడు నాగమల్లయ్యకి ఎకరం నేలా. చిన్న మిద్దే వుండేది.

(కానరొచ్చి) చావుపుండు. కార్నెల్లు నిండి తన నాగమల్లయ్య చనిపోయేనాటికి బాలవ్వ చేతులో ఇరవయి తులాల బంగా రము. ఎనభై ఎకరాల నేల. రెండు కూర గాయ తోటలు. ఊరి అప్పు ఖాతాల కాగి తాలూ దక్కాయి.

అనవసర ఖర్చని తను మొగుడి శవాన్ని కాలేయలేదు. కొడుకుల్తో ఎత్తించి బొంద పెట్టింది. కానీ—? తను మాత్రం. తన శవం మాత్రం తప్పక కాలేయించుకోవా లనుకుంది. కాష్ఠంలోనే తను.

అందుకే— బంగారం.... డబ్బు....

బిగకీసి కట్టిన నారపోచల మధ్యనుంచి తెల్లగుడ్డ గాలికి రెపరెపలాడుతోంది. బాలవ్వ చనిపోయిన కలలాగే—

అతి నిశ్శబ్దంగా నడుస్తోంది శవం.

ఊరు దాటిన అయిదో గజానికే బిడ్డ ఏడవటం మానేసినట్టుంది. కాష్ఠానికి కాస్త దూరంగా పాడె దించారు.

దింపుడు గల్లం చేశారు. తమ్మలి వాడే పూజచేసి నీళ్ళు చల్లేడు.

బాలవ్వ పెయిమీద గంటీలు తీయా లన్నారు.


బలిమిగా లాగాడు నర్సయ్య. చెవి రంధ్రాలు నిశ్శబ్దంగానే తెగిపోయాయి.

"గంటీలు నాకే రావాలె" అన్నది బిడ్డ.

"ఖర్చు మేం పెడతన్నం. మాకే చెందుతయి" అన్నది లచ్చవ్వ.

ఇద్దరి మధ్యా తిట్లూ. వాదాలూ జరి గాయి.

పరుశ రాములు. నాగరాజం అక్కవైపే వాదించడంతో నర్సయ్య చేతిలోంచి గంటీలు స్థలమార్పు జరిగి ఆడబిడ్డ చేతి



"తల్లి కాని తల్లి"

ఫొటో : కె. సత్యనారాయణ ప్రసాద్. నూజివీడు

లోకి చేరకతప్పలేదు.

పాడె మళ్ళీ లేచింది.

తమ్మలి డప్పు మళ్ళీ మోగింది. శవం ముందుకుసాగింది.

అడుగులు తడబడుతున్నాయి. ఆగిపోయాయి.

పరుశ రాములు ఆశ్చర్యపోయాడు. తమ్మలి ఆశ్చర్యపోయాడు.

పాడె మోస్తున్న నలుగురూ వెనకాతల వచ్చిన ఆడవాళ్ళిద్దరూ.... ఆ కళ్ళన్నీ ఆశ్చర్యపోయాయి.

శవాన్ని మోస్తున్న నర్సయ్య తనే శవమైపోయినట్టున్నాడు.

ఆ కాష్ఠం—

కష్టపడి పేర్చిన కాష్ఠం—

రాత్రి నిద్ర లేకుండా పేర్చిన కాష్ఠం—

ఏమైందోకాని అక్కడంతా బూడిద మాత్రం వుంది.

శవంకోసం పేర్చిన కాష్ఠం శవం రాకముందే కాలిపోయినట్టు ఆ బూడిద సాక్ష్యం చెబుతోంది.

నర్సయ్యకు ఏడుపొచ్చింది అచ్చవ్వకు మల్లే—

పాడె దిగింది.

నర్సయ్యకు కోపమొచ్చింది సూర్యుడికి మల్లే—

మంటల్లాంటి గీతలు కళ్ళల్లో ఏర్పడ్డం తోటే చెట్లు విరిచేస్తున్నట్లు పళ్ళు ఫెళ ఫెళ మన్నాయి.

"లంజ కొడుకులసంగతి.... చెప్త" మనసు ఏమంటుందోకాని నర్సయ్య కాళ్ళు మాత్రం భయంకరంగా వెనుదిరిగాయి.

మాదిగిండ్ల వైపు భూకంపంలా వెళుతున్నాడు నర్సయ్య.

చింతచెట్టు కింద నిలబడి చుట్టూ చూసేడు. నిశ్శబ్దంగా వుంది. దూరంగా ఓ గుడిసె దగ్గర నలుగు రయిదుగురు కూచుని వున్నారు. పేలుతున్న ఫిరంగుల్లా అడుగులేస్తూ వాళ్ళవైపుకు నడిచాడు.

"రాజాలూ" కాసేపాగి "మీరన్నంత యిత్తగని జెర జల్ది రాండ్రి" చింతచెట్టు నీడకు చల్లబడ్డట్టు చాలా చల్లగా మాట్లాడేడు.

వాళ్ళు మరో మాటనలేదు. అందర్నీ పిలచుకుని లేచారు గొడ్డళ్ళతో సహా — నర్సయ్య లొంగిపోవడం మాదిగలకు సంతోషంగా వుంది.

చింతల్లో కట్టె కొట్టేస్తున్నారు.

చాలా హుషారుగా గాలికి ఊగే కొమ్మల్లా ఊగుతూ టకటకా పని చేస్తున్నారు. పెరిగిన కొండను ఎక్కేసినంత సంతోషం-వాళ్ళని హుషారుగా పని చేయిస్తోంది.

ఆడాళ్ళు పాడె చుట్టూ కూర్చున్నారు.

ఆడది కాకపోయినా ఆడాళ్ళ మధ్య శవం దగ్గరే కూర్చున్నాడు నాగరాజు.

పరుశరాములు దూరంగా వెళ్ళి తాటి చెట్టుకింద కూచుని ఎటో చూస్తున్నాడు.

నర్సయ్యా, ముత్తడు మంగపొద దగ్గర మాట్లాడుకుంటున్నారు.

చూస్తున్నంత సేపట్లోనే కాష్ఠం పేర్చటం పూర్తయిపోయింది.

అందరూ కాష్ఠం వద్దకి చేరారు.

ముత్తడు మాత్రం రాలేదు. ఎటో వెళ్ళి సట్టున్నాడు.

మగవాళ్ళంతా అక్కడే ఉన్నట్టుగా చాలామందున్నారు మాదిగలు.

పాడె లేచింది.

పాడెలోని బాలవ్వ లేచింది. కాట్లో పడుకోబెట్టబడింది.

బాలవ్వ మీద కట్టె పేర్చుతున్నారు అందరూ కలిసి.

పెద్ద పెద్ద మొద్దులు తెచ్చి బాలవ్వ మీద పెడుతుంటే చాన్నాళ్ళ కసినంతా తీర్చుకుంటున్నట్లు హుషారుగా అన్పించింది మాదిగవాళ్ళకు!!

పరుశరాములు చిల్లుల కుండతో కాష్ఠం చుట్టూ తిరిగి ఎడంచేత్తో కొరివిపెట్టేడు. పొగచూరుతున్న కాష్ఠం మీద మీసాలతను కిరోసిన్ వెదజల్లుతుంటే "మంట" గుప్పున లేస్తోంది.

ఎందుకో మాదిగలు చాలా సంతోషంగా కనిపిస్తున్నారు.

బాలవ్వ చాలావరకు కాలిపోయింది.

నర్సయ్య వాళ్ళు అందరూ స్నానాలు చేయడానికి బావివైపు వెళ్ళారు.

బీడీ కాల్చుతూ వచ్చిన వాడ్డె ముత్తడు నర్సయ్య కోసం వాళ్ళనడిగి బావి వైపు వెళ్ళిపోయేడు.

తృప్తిని చప్పరిస్తూ, హుషారును మింగుతూ మాదిగలు ఊరిమొఖాన నడిచారు.

వాళ్ళ పోరలు కొందరు ఏడుస్తూ, రొప్పుకుంటూ పరిగెత్తుతూ ఎదురొస్తున్నారు.

"ఏమైందిరా" అన్నాడు ఎర్ర రుమాలతను అతనితోపాటు మరో ఇద్దరూ అదే అడిగారు.

"మంట...." అని అస్పష్టంగా వెక్కిళ్ళు పడుతూ ఏడుస్తూ అంటున్నారా పోరలు. అంతకంటె ఏమీ చెప్పటంలేదు.

కాదు జరిగింది చెప్పటానికి ఆ అమాయకత్వానికి నోరు రావటంలేదు.

మీసాలతను మరికొందరు గాభరా పడుతూ పరిగెత్తారు.

ముసలాళ్లు పరుగుతో ఊహలుపోతూ నడిచారు.

పరిగెత్తుతున్న ఆ కళ్ళు ఆత్రంగా ఉన్నాయ్.

తీరావచ్చి గుడిసెల్ని చూసిన ఆ కళ్ళు అట్టే ఆగిపోయాయి.

కళ్ళు కొయ్యబారి చూస్తున్నాయి.

వాళ్ళ ఒక్కొక్కరికీ ఒక్కొక్క కాష్ఠం ఎదురుగా రగులుతూ కన్పించింది.